## రేపల్లె మున్సిపల్ ప్రత్యేక అధికారిగా ఆర్డీవో శ్రీదేవి

**రేపల్లె, మార్చి 26, ప్రభాతవార్త:** పురపాలక సంఘం పాలకవర్గం పదవీకాలం పూర్తికావడంతో రేపల్లె పురపాలక సంఘానికి ప్రత్యేక అధికారిగా రేపల్లె ఆర్డీవో బి.శ్రీదేవి నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.దీంతో ఆర్డీవో శ్రీదేవి గురువారం రేపల్లె మున్సిపల్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు.పురపాలక సంఘానికి ఎన్నికల అనంతరం తిరిగి పాలకవర్గం ఏర్పడే వరకు ప్రత్యేక అధికారి పరిపాలన కొనసాగనుంది.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు,రేపల్లె మండల తహశీల్దార్ ఎం.శ్రీనివాసరావు,మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# బాపట్ల జిల్లా వార్త



## విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

**నిజాంపట్నం, మార్చి 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎంఇఓ శోభచంద్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన నిజాంపట్నం శివారు శివపురం మండల పరిషత్ పాఠశాలను అగ్నికుల క్షత్రియకార్పోరేషన్ డైరెక్టర్ బి రామకృష్ణ ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుపట్ల ఆసక్తి కలిగి ఉండాలన్నారు. విద్యార్థులకు ఆకలి తెలియకుండా ఉండేందుకు పాఠశాలల్లోనే భోజనం ఏర్పాటు చేశారన్నారు. మధ్యాహ్న భోజనం ఎలా ఉందో రుచి చూశారు. మెనూ ప్రకారం భోజనం వండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తెదెపా నాయకులు పాల్గొన్నారు.



## సూర్యలంక అడవి రెవెన్యూ భూములను పరిశీలించిన కలెక్టర్ వినోద్ కుమార్

**బాపట్ల,మార్చి26, ప్రభాతవార్త:** సూర్యలంక అడవి రెవెన్యూ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూములను జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మెరైన్ పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో పర్యటించిన ఆయన, సర్వే నంబర్ 547/3తి7 లోని 4.03 ఎకరాల భూమికి సంబంధించిన మ్యాపులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. సూర్యలంక బీచ్ సమీపంలోని ప్రభుత్వ స్థలంలో ఉన్న శివాలయం, మెరైన్ పోలీస్ స్టేషన్, ఫిష్ ఆంధ్ర షాపులు మరియు పంచాయతీ స్థలాలను కలెక్టర్ పరిశీలించారు. సుమారు 3 ఎకరాల ఖాళీ ప్రదేశం చుట్టూ తక్షణమే ప్రహరీ గోడ ఏర్పాటు చేయాలని, దీనికి



సంబంధించి అంచనాలు సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ ఇన్చార్జ్ డి.ఇ రామారావును ఆదేశించారు. అదేవిధంగా, సదరు సర్వే నంబర్లో ఆక్రమణకు గురైన ప్రాంతాలను గుర్తించి, నోటీసులు జారీ చేసి తక్షణమే ఖాళీ చేయించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ప్రభుత్వ భూమిలో వెలిసిన శివాలయ నిర్మాణ వివరాలపై బాపట్ల ఎంపీడీవోను ఆరా తీశారు.

**తుపాను రక్షణ భవనం తనిఖీ**

అనంతరం సూర్యలంక బీచ్ వద్ద ఉన్న తుపాను రక్షణ భవనాన్ని కలెక్టర్ సందర్శించారు. భవనంలోని రెండు అంతస్తులు, గదులను పరిశీలించిన ఆయన, భవనం పైనుండి చుట్టుపక్కల పరిసరాలను వీక్షించారు. అత్యవసర సమయాల్లో భవనం వినియోగం, నిర్వహణపై అధికారులకు సూచనలు చేశారు.ఈ పర్యటనలో బాపట్ల ఆర్డీవో గ్లోరియా, తహసీల్దార్ సలీమా, ఇన్చార్జ్ పంచాయతీరాజ్ డి.ఇ రామారావు, ఎంపీడీవో బాబురావు, మండల సర్వేయర్ లక్ష్మీనారాయణ తదితర అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి : బాపట్ల కలెక్టర్ వినోద్‌కుమార్

**భట్టిప్రోలు(రేపల్లె), మార్చి 26, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రమైన బాపట్ల నుండి రేపల్లె మండలంలోని పెనుమూడి వరకు 216 జాతీయ రహదారిపై ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు.గురువారం ఓలేరు, కన్నెగంటివారిపాలెం, శివంగులపాలెం ప్రాంతాలలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు.216 జాతీయ రహదారి నుండి కన్నెగంటి వారిపాలెం,ఓలేరు గ్రామాలలోకి వెళ్ళేందుకు ఉన్న మలుపు వద్ద రోడ్డుకు ఇరువైపులా జాతీయ రహదారిపై ఎత్తులో సైడ్ వాల్స్,స్తంభాల కారణంగా ఆ ప్రాంతాలలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని భట్టి ప్రోలు ఎస్ఐ ఎం.శివయ్య వివరించారు.ప్రమాదాలు,మృతుల సంఖ్య గురించి కలెక్టర్ వినోద్‌కుమార్ అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ వినోద్‌కుమార్ మాటా్లడుతూ 24 గంటల



వ్యవధిలో మలుపుల వద్ద ఎత్తుగా ఉన్న స్తంభాలను తొలగించాలని సంబంధిత రహదరాల భవనాల శాఖ అధికారులను ఆదేశించారు.లైట్లు, వేగ నియంత్రణ రబ్బరు స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని చెప్పారు.216 జాతీయ రహదారిలో జరుగుతున్న ప్రమాదాల నివేదికను జాతీయ రహదారుల ప్రాంతీయ అధికారి,మచిలీపట్నంలోని పి.డి. జాతీయ రహదారుల శాఖ అధికారులకు పంపాలని ఉప రవాణా శాఖ అధికారిని ఆదేశించారు.ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లని విధంగా రహదారి వ్యవస్థ సవ్యంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రేపల్లె ఆర్డీవో బి.శ్రీదేవి,డిటివో పరంధామ రెడ్డి,భట్టి ప్రోలు ఇన్‌ఛార్జి తహశీల్దార్ వెంకటేశ్వర్లు,ఎంపిడివో వెంకటరమణ,రేపల్లె ఆర్‌అండ్‌బి డిఇ పి.రాజేష్,వేమూరు సి.ఐ పసుపులేటి వీరాంజనేయులు,నగరం,చెరుకుపల్లి ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

# పల్లెలకు జలకళ..

## రూ.20 కోట్లతో తాగునీటి పథకాల ప్రణాళిక ..!



**బాపట్ల, మార్చి 26: ప్రభాతవార్త:** గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని శాశ్వతంగా దూరం చేయడమే లక్ష్యంగా బాపట్ల నియోజకవర్గంలో భారీ కసరత్తు జరుగుతోంది. వేసవి నాటికి ప్రతి ఇంటికీ రక్షిత మంచినీటిని అందించేలా సుమారు రూ.20.34 కోట్ల నిధులతో సమగ్ర ప్రణాళిక సిద్ధమైందని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పథకం కింద నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు మంజూరయ్యా యన్నారు. నియోజక వర్గంలోని ఎనిమిది ప్రధాన గ్రామాల్లో తొలి విడతగా ఈ పనులకు శ్రీకారం చుడుతున్నారు.

**నిధుల మంజూరు వివరాలను ఎమ్మెల్యే ఈ విధంగా వివరించారు:** బాపట్ల మండలం (మొత్తం: రూ.7.23 కోట్లు),భర్తీపూడి: అత్యధికంగా రూ.6.30 కోట్లతో భారీ ప్రాజెక్టు,అప్పికట్ల: రూ.48.60 లక్షలు,ఉప్పలవారిపాలెం: రూ.45 లక్షలు,2. కర్లపాలెం మండలం (మొత్తం: రూ.7.17 కోట్లు),పెదపులుగువారిపాలెం: తీర ప్రాంత గ్రామ దాహార్తి తీర్చేందుకు రూ.3.73 కోట్లు,నర్రావారిపాలెం: రూ.3.43 కోట్లతో సంపూర్ణ తాగునీటి పథకం,3. పిట్టలవానిపాలెం మండలం (మొత్తం: రూ.5.93 కోట్లు),చందోలు: రూ.4.54 కోట్లు,సంగుపాలెం కోడూరు: రూ.1.01 కోట్లు,అలకాపురం: రూ.38 లక్షలు.

తీర ప్రాంత గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడటమే మా ప్రాధాన్యత. మహిళలు నీళ్ల కోసం మైళ్ల దూరం నడిచే పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతో ఇంటింటికీ కొళాయి పథకాన్ని వేగవంతం చేస్తున్నాం. నా విన్నపానికి స్పందించి నిధులు మంజూరు చేసిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

**వేసవిలో ఇబ్బందులు లేకుండా..**

రాబోయే ఎండకాలంలో ఏ ఒక్క గ్రామం కూడా నీటి ఎద్దడిని ఎదుర్కోకూడదనే లక్ష్యంతో అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ముఖ్యంగా తీర ప్రాంత గ్రామాల్లో జలజీవన్ మిషన్ ద్వారా సరఫరాను పునరుద్ధరించి, ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నీటిని అందించేందుకు కట్టుబడి ఉన్నామని ఆయన స్పష్టం చేశారు.

## వైకాపా నాయకులు,కార్యకర్తల పై అక్రమ కేసులు అన్యాయం

**రేపల్లె, మార్చి 26, ప్రభాతవార్త:** రేపల్లె నియోజకవర్గంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 42 మందిపై పోలీస్ శాఖ సిఐ అక్రమ కేసులు నమోదు చేయడం విచారకరమని వైకాపా రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త పీటా నాగమోహన్‌కృష్ణ అన్నారు.గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విచారణ పేరిట రెండు మూడు గంటలు వేధిస్తున్నారని విమర్శించారు.రేపల్లెలో వైకాపాకు చెందిన కేసు ఒక్కటే ఉందా మరే విధమైన కేసులు లేవా అని సిఐని ప్రశ్నించారు.90 రోజుల పాటు పోలీస్ స్టేషన్‌కు రావాలని వైకాపా నాయకులను భయపెడుతున్నారని నాగమోహన్‌కృష్ణ పేర్కొన్నారు. పార్టీ నాయకులు,కార్యకర్తలకు అండగా ఉంటానని ఆయన చెప్పారు.ప్రజల పక్షాన ఉండాల్సిన సిఐ కూటమి ప్రభుత్వం తరపున ఉన్నట్లు



కనిపిస్తున్నదన్నారు.కాపు సామాజిక వర్గానికి చెందిన పట్టణ నాయకురాలిని మూడు నాలుగు గంటలు విచారణ పేరుతో టౌన్ సిఐ ఇబ్బంది పెడుతున్నారని నాగమోహన్‌కృష్ణ చెప్పారు.అరవపల్లి తిరునాళ్ళ సందర్భంగా కాపు సోదరులను ఏ విధంగా కొట్టారో ఆ సామాజికవర్గం పట్ల సిఐ వైఖరి అర్థమవుతున్నదన్నారు.రేపల్లెలోని కాపులపైనా లేదంటే వైఎస్ఆర్‌సిపిలోని కాపుల మీద వివక్షతో ఉన్నారో తమకు అర్థం కావడంలేదన్నారు.భూ సెటిల్‌మెంట్లు జరుగుతుంటే ఎటువంటి చర్యలు లేవని ఆయన ఆరోపించారు.ఈ సెటిల్‌మెంట్లపై సిఐ దృష్టి కేంద్రీకరిస్తే బావుంటుందని నాగమోహన్‌కృష్ణ సూచించారు. అక్రమ కేసుల్లో చిక్కుకుంటున్న నాయకులు, కార్యకర్తలను న్యాయ మార్గంలో ఏవిధంగా రక్షించుకోవాలో వైకాపా అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి తమకు దిశానిర్దేశం చేశారని ఆ విధంగానే వ్యవహరిస్తామని వెల్లడించారు.చట్టరీత్యా వ్యవహరిస్తే ఎటువంటి అభ్యంతరం లేదని చట్టాన్ని అతిక్రమించి వ్యవహరించడం భావ్యం కాదని ఆయన హితవు పలికారు.భవిష్యత్ పోరాటాలకు వైఎస్సార్ సీపీ సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.ఈ సమావేశంలో పార్టీ నాయకులు చిమటా బాలాజీ,చిత్రాల ఓబేదు,యార్లగడ్డ మదన్‌మోహన్ మాలవ్య తదితరులు పాల్గొన్నారు.

# మత్తుకు దూరం..రక్షణకు చేరు!

### వెదుళ్ళపల్లిలో ఎస్సై భాగ్యరాజ్ ఆధ్వర్యంలో వినూత్న అవగాహన సదస్సు

**బాపట్ల,మార్చి26. ప్రభాతవార్త:** సమాజంలో పెచ్చరిల్లుతున్న మాదకద్రవ్యాల వినియోగంపై యువత అప్రమత్తంగా ఉండాలని, చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండటమే రక్షణకు మార్గమని వెదుళ్ళపల్లి ఎస్సై భాగ్యరాజ్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు గురువారం వెదుళ్ళపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పూల మార్కెట్ వద్ద ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు .యువత భవిష్యత్తు నాశనం కావొద్దు..మత్తు పదార్థాల వినియోగం కేవలం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా, కుటుంబ వ్యవస్థను, బంగారు భవిష్యత్తును చిన్నాభిన్నం చేస్తుందని ఎస్సై ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి రవాణా, విక్రయాలు చట్టరీత్యా తీవ్రమైన నేరాలని, ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.మహిళలపై జరిగే నేరాల పట్ల పోలీస్ శాఖ అత్యంత కఠినంగా వ్యవహరిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈవ్ టీజింగ్, వేధింపులకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. మహిళలు ఎటువంటి భయాందోళనలు చెందకుండా ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావాలని, వారికి పోలీస్ శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.హెల్మెట్ ప్రాణరక్షకంరోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం మృత్యువును ఆహ్వానించడ మేనని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఈగిల్ టీమ్ హెడ్ కానిస్టేబుల్ సురేష్, పోలీస్ సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మంత్రి సత్యప్రసాద్‌తో రేపల్లె ఆర్డీవో భేటీ

**రేపల్లె, మార్చి 26, ప్రభాతవార్త:** రేపల్లె రెవెన్యూ డివిజనల్ అధికారిణిగా బాధ్యతలు స్వీకరించిన ఆర్డీవో బి.శ్రీదేవి గురువారం రాష్ట్ర సచివాలయానికి వెళ్ళారు.రాష్ట్ర రెవెన్యూ శాఖ



మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.రేపల్లెలో ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన శ్రీదేవిని ప్రత్యేకంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ అభినందించారు .ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందేలా ప్రజల సంక్షేమం నెరవేరేలా విధులను నిర్వర్తించాలని ఆయన సూచించారు.ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అందుకు తగినవిధంగా అధికార యంత్రాంగం సహకారం అవసరమని మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు.

## కొబ్బరి చిప్పలతో శ్రీరాముడు,సీత,ఆంజనేయ స్వామి రూపాలు

**రేపల్లె, మార్చి 26, ప్రభాతవార్త:** భారతీయ సంస్కృతిలో కొబ్బరికాయ అదృష్టం,సంక్షేమానికి చిహ్నమైనందున ప్రతి శుభ కార్యక్రమం కొబ్బరికాయ కొట్టడంతోనే ప్రారంభమవుతుంది.ఒక సాంప్రదాయ ఆచారంగా కొబ్బరికాయ సమర్పణ అనేది పూర్వం నుండి వస్తోంది.కొబ్బరికాయలో ఔషధగుణాలు ఉనాన్నయి. కొబ్బరి చిప్పలను వ్యవసాయ వ్యర్థాలుగా ఉపయోగిస్తున్నారు. ప్రజలు అత్యధిక యాంటీ ఆక్సిడెంట్ గుణాలు కలిగిన కొబ్బరి కాయ ప్రయోజనాన్ని పొందుతున్నారు. కొబ్బరి కాయకు ఉండే పెంకు భాగం అనుబంధాలను,లోపలి తెలుపు భాగం స్వచ్ఛతను ప్రతిబింబించేలా భక్తిని,కృతజ్ఞతను ప్రతిబింబించే కొబ్బరికాయకు ఉండే ఆధ్యాత్మిక ప్రాధాన్యతను అటుంచితే కళాకారులు సైతం తామేమీ తక్కువ కాదంటూ కొబ్బరి చిప్పలతో కళాకృతులను సృష్టిస్తున్నారు.రేపల్లె పట్టణానికి కూతవేటు దూరంలోని సజ్జావారిపాలెంకు చెందిన కళాశ్రీమణి అవార్డు,లిమ్కా రికార్డు గ్రహీత వల్లభనేని సత్యసాయి బాబు కొబ్బరి చిప్పలకు రూపం కల్పిస్తూ ప్రజల ఆదరణ పొందుతున్నారు.శ్రీరామ నవమి సందర్భంగా కొబ్బరి చిప్పలతో శ్రీరాముడు, సీతాదేవి, ఆంజనేయ స్వామి బొమ్మలను తయారు చేశారు.వీక్షకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి.కొబ్బరి చిప్పలతో అద్భుతమైన కళాకృతులను సృష్టిస్తున్న సత్యసాయిబాబును తీరప్రాంత ప్రజలు అభినందిస్తున్నారు.



## వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**భట్టిప్రోలు(రేపల్లె), మార్చి 26, ప్రభాతవార్త:** వేసవి దృష్ట్యా మండలంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భట్టి ప్రోలు ఎంపిపి డి.వెంకట లలితకుమారి అన్నారు.గురువారం జరిగిన వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూహెచ్‌పివి వ్యాక్సినేషన్ 14 సంవత్సరాల పిల్లలకు వేయించాలని చెప్పారు.రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆమె ఆదేశించారు.ఎంపిడివో ఎస్.వెంకటరమణ మాట్లాడుతూ క్షయ రోగులకు పూర్తిస్థాయి వైద్యం



అందించాలన్నారు.క్షయ నిర్మూలన మండలంగా తీర్చిదిద్దాలని ఆమె సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఆమె సూచించారు.ఈ సమావేశంలో పిహెచ్‌సి డాక్టర్ జి.అబ్రహం లింకన్,డాక్టర్ పవన్ చైతన్య,సర్పంచ్ బి.రవి,సీనియర్ అసిస్టెంట్ సుస్మిత,సిబ్బంది పాల్గొన్నారు.

## ఆకలి తీర్చడంలోనే సంతృప్తి

**రేపల్లె, మార్చి 26, ప్రభాతవార్త:** పాతబస్తీలోని అమ్మవారి దేవాలయం వద్ద శ్రీ వాసవి సేవా మహిళా మండలి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం అమృత ధార కార్యక్రమంలో భాగంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పొన్నూరు గౌరీ రామకుమారి మాట్లాడుతూ ఆకలి తీర్చే కార్యక్రమం ద్వారా సంతృప్తి



లభిస్తున్నదని చెప్పారు.నిర్విరామంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో సిహెచ్. ఇందుమతి, ఎం.విజయ,సిహెచ్.అలివేలు ,కె.సత్యవతి, ఎ.సుభాషిణి,బి.శివకుమారి, బి.సువర్ణ,పి.తేజస్వి,సిహెచ్.లక్ష్మీ భారతి తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

## కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్

**కర్లపాలెం.మార్చి 26: ప్రభాతవార్త:** బాపట్ల ఉమెన్స్ ఇంజనీరింగ్ కాలేజ్ ఎన్ఎస్ఎస్ (వివిలీ) యూనిట్1 ఆధ్వర్యంలో నల్లమోతువారిపాలెంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరం గురువారం నాలుగవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామంలో పారిశుధ్యం, ఆరోగ్య పరిరక్షణపై విద్యార్థినులు విస్తృత అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కే. అనూష మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పరిశుభ్రమైన జీవనశైలిని అలవాటు చేసుకోవాలని కోరారు. వ్యాధుల నివారణకు పరిసరాల శుభ్రత ఎంతో కీలకమని, ముఖ్యంగా తాగునీటి విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం ఏఎన్ఎంలు శివనాగమణి, సుబ్బలక్ష్మి మాట్లాడుతూ.. వ్యక్తిగత పరిశుభ్రత, చెత్త నిర్వహణపై గ్రామస్థులకు వివరించారు.గ్రామ సర్పంచ్ ఎం. సుబ్రహ్మణ్యం శిబిరానికి విచ్చేసి విద్యార్థినుల సేవా కార్యక్రమాలను అభినందించారు. గ్రామ అభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావడం సంతోషకరమని, తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. ఈ శిబిరం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కృష్ణకుమారి పర్యవేక్షణలో ఘనంగా జరిగింది. కార్యక్రమంలో కళాశాల విద్యార్థినులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## శ్రీరామనవమి విశిష్టత ఎనలేనిది

**గుంటూరు విద్య, మార్చి 26, ప్రభాతవార్త**

భారతీయ సంస్కృతి సంప్రదాయాలు పండుగ ల అంశాలలో శ్రీరామనవమికి ఎనలేని విశిష్టత ఉందని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబు మాదిగ పేర్కొన్నారు. శ్రీరామనవమి పండుగ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ శ్రీరామచంద్రుడు తన పరిపాలనా కాలంలో రాజ్యాన్ని సుభిక్షంగా ఉంచడమే కాకుండా తండ్రి మాట జవదాటని రాజుగా చరిత్రలో నిలిచారని అలాంటి మహనీయ శ్రీరామ చంద్రమూర్తి జీవిత చరిత్ర ను ప్రతి ఒక్కరూ ఆదర్శవంతమైన మార్గంగా మల్చుకొని నడవాలని



ఆయన పేర్కొన్నారు. తమ్ముడు లక్ష్మణుడు పట్ల ప్రేమ ఆప్యాయతలను చూపటమే కాకుండా సీతమ్మ తల్లి పట్ల ఆయన చూపిన ప్రేమ నేటి సమాజంలోని ప్రతి ఒక్కరికి ఆదర్శమని ఆయన తెలిపారు. భద్రాచలంలోని శ్రీరామ ఆలయంలో శ్రీరామనవమి కన్నుల పండుగగా జరగటం , ఆ శ్రీరామచంద్రుని కళ్యాణ వైభవం చూడ ముచ్చటను గొలుపుతోందని ఆయన పేర్కొన్నారు.

## వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించాలి

**రేపల్లె, మార్చి 26, ప్రభాతవార్త:** వ్యవసాయ రంగంలో రైతులు అధిక దిగుబడులు సాధించాలని రేపల్లె వ్యవసాయ సహాయ సంచాలకులు అద్దేపల్లి లక్ష్మి చెప్పారు.గురువారం మండలంలోని నల్లూరుపాలెంలో వ్యవసాయ శాఖ,ఆత్మల సంయుక్త ఆధ్వర్యంలో సాంప్రదాయ వ్యవసాయంలో సుస్థిరత సాధించేందుకు



అవసరమైన నైపుణ్యాల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ తరహా శిక్షణ పొందిన రైతులు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోగలరని తెలిపారు.శిక్షణ పొందిన రైతులకు ధృవీకరణ పత్రాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి అవ్వారు మహేష్‌బాబు,కె.సుమంత్,సతీష్,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వెల్లటూరులో 300 మందికి వైద్యపరీక్షలు

**భట్టిప్రోలు(రేపల్లె), మార్చి 26, ప్రభాతవార్త:** మండలంలోని వెల్లటూరులోని శ్రీ కట్లమ్మ తల్లి దేవాలయం ఆవరణలో గురువారం గుంటూరు లలితా సూపర్ స్పెషాలిటీ వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.300 మందికి పైగా ఈసీజి,బిపి,షుగర్,థైరాయిడ్ వంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు.నిర్వాహకులు ఉచితంగా మందులను పంపిణీ చేశారు.ఈ




కార్యక్రమంలో హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ పి.బసవరాజు,డాక్టర్ జగన్నాధం,రామాజనేయులు, రమేష్,రాజు, మోటూరు వాసుదేవరావు,వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ నంబూరు నాగభూషణరావు, యార్లగడ్డ రాఘవేంద్రరావు,కొల్లి శ్రీనివాసరావు, వెంకటప్పయ్య,పారా మెడికల్,ఫార్మాసిస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నవమి వేడుకలకు ముస్తాబైన రామ మందిరాలు

**వేమూరు మార్చి 26 (ప్రభాతవార్త) :** శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకుని మండలంలోని రామాలయాల్లో నవమి వేడుకలకు సిద్ధం చేశారు. సీతారాముల కళ్యాణం జరిపించేందుకు చలువ పందిళ్ళు ఏర్పాటు చేసి రాముల వారి కళ్యాణం జరిపించేందుకు ఏర్పాట్లు చేశారు. మండలంలోని గ్రామాల్లో వేమూరు, చావలి, పెరవలి, పెరవలిపాలెం, కుచ్చెళ్ళపాడు, మరియు ఇతర గ్రామాల్లో కూడా వేడుకలకు ఆలయాలను సిద్ధం చేశారు. ఐదు రోజుల పాటు జరిపించే వేడుకల్లో నవమి రోజున రాముల వారి కళ్యాణం జరిపించనున్నారు. వేడుకలకు సంబంధించి ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

**రేపల్లె, మార్చి 26, ప్రభాతవార్త:** రబీ సీజనులో రైతులు పండించిన పంటల దిగుబడులకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని రేపల్లె ఆర్డీవో బి.శ్రీదేవిని గురువారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వేమూరు నియోజకవర్గం సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు కోరారు.రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆర్డీవో దృష్టికి తీసుకువచ్చారు.సమస్యలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆర్డీవో శ్రీదేవి వెల్లడించారు.ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## హెల్మెట్ ధరించండి సేఫ్‌గా ప్రయాణం సాగించాలి

**కొల్లూరు, మార్చి 26, (ప్రభాతవార్త) :** బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు కొల్లూరు పోలీస్ స్టేషన్ ఎస్సై పి.కోటేశ్వరరావు గురువరం చిలుమూరు గ్రామం వద్ద కరకట్ట పై టూ వీలర్స్ పై ప్రయాణం చేసే వాహనదారులకు హెల్మెట్ ధరించి సేఫ్‌గా ప్రయాణం సాగించాలని అవగాహన ఫ్రోగ్రామ్ నిర్వహించారు.

# విజ్ఞాన్ లారా విద్యార్థినికి బ్యాడ్మింటన్‌లో స్వర్ణ పతకం

**పొన్నూరు, మార్చి 26,ప్రభాతవార్త:** చేబ్రోలు మండల పరిధిలోని వడ్లమూడి విజ్ఞాన్ లారా ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్(సీఎస ఈ) మొదటి సంవత్సరం చదువుతున్న పెదపూడి ప్రజ్ఞా సుహాసిని అంతర్జాతీయ స్థాయిలో



నిర్వహించిన ఇండియా–థాయిలాండ్ బాల్ బ్యాడ్మింటన్ పోటల్లో అద్భుత ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకం సాధించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.ఫణీంద్రకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ ఇండియా–థాయిలాండ్ టెస్ట్ సిరీస్ 2025–26పోటీలలో అండర్–22 బాలురు, బాలికల బాల్ బ్యాడ్మింటన్ విభాగాల్లో భాగంగా థాయిలాండ్‌లోని బ్యాంకాక్‌లో ఐదు రోజుల పాటు జరిగిన పోటీలలో ఆమె పాల్గొన్నట్లు తెలిపారు. ఇండియా–థాయిలాండ్ జట్ల మధ్య జరిగిన ఫైనల్ పోటీలో థాయిలాండ్ జట్టుపై విజయం సాధించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుందని చెప్పారు. ఈ సందర్భంగా విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ క్రీడలపై ఆసక్తి ఉన్న విద్యార్థులను గుర్తించి, నిపుణులైన కోచ్‌లతో ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ద్వారా ఇలాంటి విజయాలు సాధ్యమవుతున్నాయని తెలిపారు. విద్యార్థులకు విద్యతోపాటు క్రీడల్లో కూడా ప్రోత్సాహం అందించడం వల్ల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో స్వర్ణ పతకం సాధించడం విజ్ఞాన్ విద్యాసంస్థలకు గర్వకారణమని తెలిపారు. ఇటువంటి విజయాలు ఇతర విద్యార్థులకు స్ఫూర్తినిచ్చి క్రీడలు, విద్యలో ముందుకు సాగేందుకు ప్రేరణగా నిలుస్తాయని చెప్పారు. భవిష్యత్తులో కూడా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. పతకం సాధించిన పెదపూడి ప్రజ్ఞా సుహాసినిని విజ్ఞాన్స్ ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, ప్రిన్సిపాల్ కే.ఫణీంద్రకుమార్, ఆయా విభాగాల డీన్లు, విభాగాధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

## పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

**-మండల విద్యాశాఖాధికారి దూపం రాజు**

పొన్నూరు, మార్చి 26,ప్రభాతవార్త: అన్ని వసతులున్న ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని మండల విద్యాశాఖాధికారి దూపం రాజు కోరారు. మధ్యాహ్న పథకం, ఉచిత యూనిఫాం, జీఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం వంటివి నిర్వహిస్తూ విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. తమ పిల్లలను



నూతన విద్యార్థుల నమోదు కార్యక్రమంలో భాగంగా కట్టెంపూడి గ్రామంలో పర్యటించి పలువురు విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్యాపుస్తకాలు, తల్లికివందనం, డొక్కా సీతమ్మ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటి ఛైర్మన్ చల్లా ఆనంద్‌కుమార్, ప్రధానోపాధ్యా యుడు ఎన్.శివ రామకృష్ణ, దేవిరెడ్డి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని పరామర్శించిన ఎస్టీ నాయకులు

**పొన్నూరు, మార్చి 26,ప్రభాతవార్త:** పల్నాడు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని ఎస్టీ నాయకులు పరామర్శించారు. ఇటీవల అక్రమ కేసులు అరెస్టు అయి 98రోజులపాటు జైలు జీవితం గడిపి బెయిల్‌పై విడుదలైన పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని యానాది సంఘం నాయకులు గురువారం



పరామర్శించారు. వైకాపా జిల్లా అధికార ప్రతినిధి ఎందేటి వెంకటసుబ్బయ్య నేతృత్వంలో నాయకులు మాచర్ల వెళ్లి పిన్నెల్లిని కలిశారు. ఈ సందర్భంగా పిన్నెల్లి వారితో ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు బనాయించినా భయపడేది లేదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటామని, కార్యకర్తలు, నాయకులు కూడా ధైర్యంగా ఉండి కూటమి ప్రభుత్వం వైఫల్యాలలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని పిన్నెల్లి కార్యకర్తలకు సూచించారు. రామకృష్ణారెడ్డిని కలిసినవారిలో ఎస్టీ సెల్ రాష్ట్ర మాజీ కార్యదర్శి చౌటూరి రమేష్, జిల్లా కార్యదర్శి కొమరగిరి సూరిబాబు, తెనాలి నియోజకవర్గం ఎస్టీసెల్ అధ్యక్షుడు పోట్లూరి అశోక్, మాజీ ఎంపిటిసి యాకసిరి తిరుపతయ్య, పల్నాడు జిల్లా నాయకులు పోట్లూరి శివయ్య, పిడుగురాళ్ళ వార్డు కన్వీనర్ కందుకూరు శేషయ్య, ముళ్ళమూరి బాలాజీ, చెవూరి ఆంజనేయులు, తుపాకుల జాన్, తలపల శివశంకర్ తదితరులున్నారు.

## నేటి నుంచి వివిఐటి లో ప్రారంభం కానున్న నేషనల్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్

**గుంటూరు విద్య మార్చి 26 ప్రభాతవార్త :** ఎన్‌టిపిసి చెరుకూరి లెనిన్ వోల్గా మెమోరియల్ నేషనల్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్ పోటీలు 27 మార్చి నుండి ఏప్రిల్ 7 వరకు వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలజికల్ యూనివర్సిటీ నందు ప్రారంభం కానున్నాయని ప్రో ఛాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ మరియు ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో





నిర్వహించనున్న ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా ఉన్న జాతీయ, అంతర్జాతీయ ఆర్చరీ క్రీడాకారులు పాల్గొననున్నారు. అండర్15, 13, 10 అని మూడు విభాగాలుగా నిర్వహించనున్న ఈ పోటీలకు సుమారు 2300 మంది ఆర్చరీ క్రీడాకారులు నమోదు చేసుకున్నారని ఇండియన్ ఆర్చరీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ చెరుకూరి సత్యనారాయణ తెలిపారు. ఈ పోటీలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ ప్రెసిడెంట్ నందమూరి తేజస్విని ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## దళిత క్రైస్తవుల పై దాడులను అరికట్టాలి

**-మాల యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పొందుగల చైతన్య**

**పొన్నూరు, మార్చి 26,ప్రభాతవార్త:** దేశంలో దళిత క్రైస్తవులపై జరుగుతున్న దాడులను పూర్తిస్థాయిలో అరికట్టేవిధంగా పాలకులు ఆలోచన చేయాలని మాల యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పొందుగల



చైతన్య కోరారు. రాష్ట్రంలో రోజు రోజుకు క్రైస్తవులపై దాడులు పెరుగుతున్నాయన్నారు. అగ్రవర్ణాలు పాలక పార్టీల అండదండలతో ఇలాంటి దాడులకు పూనుకొంటున్నారన్నారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా లభించదని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మంచి పరిణామం కాదన్నారు. దీంతో దళిత క్రైస్తవులపై దాడులు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రముఖ పాస్టర్ మల్లెల రాజు మాట్లాడుతూ క్రైస్తవులు, దళిత క్రైస్తవులపై దాడులు రోజు రోజుకు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో క్రైస్తవులు, దళిత క్రైస్తవులు అందరూ చైతన్యంతో కలిసికట్టుగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పొన్నూరు, నిడుబ్రోలు పాస్టర్లు, దళిత సంఘాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు.

# తెనాలి రోడ్డు విస్తరణలో ఖబరస్థాన్‌ను మినహాయించండి

**ముస్లిం ఫ్రంట్ అధ్యక్షులు ఖబరస్థాన్ పరిరక్షణ కమిటీ సభ్యులు మహమ్మద్ రఫీ**

**మంగళగిరి, మార్చి 26, ప్రభాతవార్త :** ఖబరస్తాన్ కమిటీ సభ్యులను, ముస్లిం సమాజాన్ని బెదిరించి పూర్వీకుల సమాధులపై, బ్రిడ్జి, రోడ్డు పేరిట నిర్మాణాలను జరపాలని ప్రయత్నించవద్దని ముస్లిం ఫ్రంట్ అధ్యక్షుడు ఖబరస్థాన్ పరిరక్షణ కమిటీ సభ్యుడు మహమ్మద్ రఫీ సూచించారు. ఖబరస్తాన్ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం మంగళగిరి ప్రెస్ క్లబ్ నందు వారు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ రఫీ మాట్లాడుతూ, తెనాలి రోడ్డులో తమ పూర్వీకుల సమాధులు ఉన్నాయని గుర్తు చేశారు. ఆయా సమాధులపై విస్తరణ పేరుతో రోడ్డు, బ్రిడ్జి వంటి నిర్మాణాలను జరిపి తమ మత విశ్వాసాలను దెబ్బతీయవద్దని పేర్కొన్నారు. అభివృద్ధికి తాము ఆటంకం కాదని ఖబరస్తాన్ ను మినహాయించి తెనాలి రోడ్డును విస్తరించుకోవాలని డిమాండ్ చేశారు. ముస్లిం సమాజం ఆస్తులను పరిరక్షించాల్సిన బాధ్యత అంజుమన్ సంస్థది అని తెలిపారు. ఆ బాధ్యతను నిర్వర్తించలేక అంజుమన్ సంస్థ మున్సిపాలిటీకి తలొగ్గిందని చెప్పారు. ఖబరస్తాన్ పరిరక్షణ విషయంలో గతంలోనే తాము నిరసన ర్యాలీ చేపట్టామని ఆ తర్వాత మీడియాను పిలిచి అబద్ధపు డెమో చూపించారని విమర్శించారు. ఆ డెమో బ్లూ ప్రింట్ చిత్రాలను అధికార పార్టీలో ఉన్న తమ సామాజిక వర్గం వారు బ్యానర్లుగా ప్రదర్శించారంటే దీని వెనుక ఎవరున్నారో అర్థమవుతుందని, బ్లూ ప్రింట్ కాపీలు వారికి ఎలా చేరాయని అన్నారు. ఇటీవల తాము రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసిన రోజు మత విశ్వాసాన్ని గౌరవిస్తాం తెనాలి



రోడ్డు విస్తరణను వాయిదా వేస్తున్నాం అంటూ కమిషనర్ మభ్యపెట్టే విధంగా ప్రకటన విడుదల చేశారని ఈ స్క్రిప్ట్ ఎవరు రాసి ఇస్తే ఇలా పత్రికా ప్రకటన విడుదల చేశారంటూ ప్రశ్నించారు. ప్రజల్ని, ముస్లిం సమాజాన్ని పక్కదారి పట్టిస్తున్న మంగళగిరి కమిషనర్ ఒక అధికారిలా కాకుండా ఓ రాజకీయ పార్టీ కార్యకర్తలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వాలు వస్తుంటాయి పోతుంటాయని రాజ్యాధికారం శాశ్వతం అని అనుకోవద్దని తెలిపారు. ఖబరస్థాన్ పరిరక్షణ కమిటీకి విరుద్ధంగా కమీషనర్ గంధర గోళం సృష్టిస్తున్నారని అన్నారు. ఖబరస్తాన్ లో రోడ్డు నిర్మాణానికి టిడిపిలో ఉన్న ముస్లిం సోదరులు తప్ప ఎవరూ మద్దతు తెలిపే పరిస్థితి లేదని తేల్చి చెప్పారు. మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి వద్ద తెనాలి రోడ్డు విస్తరణకు తామంతా అంగీకరించామని అందుకే గోడ కట్టలేదంటూ కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. తెనాలి రోడ్డు విస్తరణకు ఖబరస్థాన్ ను కదిలించకూడదు అనే ఉద్దేశంతోనే ఆనాడు ఆర్కే భాగవతుల వారి వీధి విస్తరణకు ప్రతిపాదన తెరపైకి తెచ్చారని తెలిపారు. తెనాలి రోడ్డు విస్తరణలో ఖబురుస్తాన్ 120 అడుగుల రోడ్డును మినహాయించాలని స్థానిక ఎమ్మెల్యే మంత్రి నారా లోకేష్ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు చెప్పారు. తమ విశ్వాసాలను గౌరవించాలని లేదంటే తమకు న్యాయస్థానాల్లో నే న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. కబరస్తాన్ పరిరక్షణ కమిటీ కన్వీనర్ మహమ్మద్ యూసఫ్ మాట్లాడుతూ, వక్ఫ్ నోటిఫైడ్ ఖబరస్తాన్ పై ప్రతిపాదిత కాంటి లివర్ ఎలివేటెడ్ బ్రిడ్జి నిర్మాణ అంశంపై గత తొమ్మిది నెలలుగా వివిధ మత పెద్దలు, రాజకీయ పార్టీలు నేతలు తమ ఆందోళన తెలియజేస్తుంటే అభివృద్ధి పేరుతో గందరగోళ వాతావరణం సృష్టించటం తగదని పేర్కొన్నారు. ఆయా విషయాలను పరిగణలోకి తీసుకొని ఖబరస్తాన్ పై ఏ విధమైన నిర్మాణాలు జరగవు అంటూ అధికారులు స్పష్టమైన ప్రకటనను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే అన్ని వర్గాలను కలుపుకొని అఖిలపక్షం ఏర్పాటు చేసి శాంతియుత ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ముస్లిం యువతరం అధ్యక్షులు, ఖబరస్తాన్ పరిరక్షణ కమిటీ సభ్యులు మహమ్మద్ ఇక్బాల్ మాట్లాడుతూ, ఐటీ విద్యా శాఖ మంత్రి స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ దృష్టికి తమ ఆవేదన వెళ్లి ఉంటే తమ సమస్యను అర్థం చేసుకొని ఆయన పరిష్కరించి ఉండే వారని తెలిపారు. ఖబరస్తాన్ ను మినహాయించి తెనాలి రోడ్డును విస్తరించుకోవాలని ఈ విషయంలో తమకు ఏ విధమైన అభ్యంతరం లేదని తాము అభివృద్ధికి వ్యతిరేకం కాదని తమ మత విశ్వాసాలను అర్థం చేసుకొని గౌరవించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఖబరస్థాన్ పరిరక్షణ కమిటీ సభ్యులు అబ్దుల్ అజీమ్, ముస్లిం యువసేన కన్వీనర్ ఇస్మాయిల్, మునీర్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వభూమిలో ఆక్రమణలను తొలగించిన తహశీల్దార్ గోపాలకృష్ణ

**తెనాలి టౌన్, మార్చి26,(ప్రభాతవార్త):** ప్రభుత్వ రెవిన్యూ భూమిని ఆక్రమించి నిర్మించిన అనధికార కట్టడాన్ని, తెనాలి మండల తహసిల్దార్ కెవి.గోపాలకృష్ణ తొలగింపజేశారు. తెనాలి రూరల్ మండల గ్రామం పెదరావూరులో శుక్రవారం ప్రభుత్వ రెవెన్యూ భూమి గ్రామ కచేరిచావడిని కొందరు ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించి అనధికార నిర్మాణాలు చేపట్టారు. విషయం తెలుసుకున్న తహసిల్దార్ కెవి. గోపాలకృష్ణ రూరల్ పోలీసుల సహాయంతో ఆక్రమణలను తొలగించి ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎవరైనా ప్రభుత్వ ఆస్తుల జోలికి వెళ్లి ఆక్రమించుకోవడం అనధికార నిర్మాణాలు చేపట్టడం లాంటివి చేస్తే వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. ఆక్రమించిన భూమి 3 సెంట్లు ఉంటుందని దాని విలువ



సుమారుగా 12 లక్షల నుండి 15 లక్షల రూపాయలు ఉంటుందని తహసిల్దార్ తెలిపారు. తహసీల్దార్ వెంట తెనాలి రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ ఆనంద్ మరియు సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.

## నవమి వేడుకల్లో భాగంగా రాములోరికి శ్రీకృష్ణావతారం అలంకరణ

**తెనాలి మున్సిపాలిటీ, మార్చి26, (ప్రభాతవార్త):** శ్రీరామనవమి వేడుకలకు ఆంధ్రపారిస్ ముస్తాబయింది. రెండవ



భద్రాచలం గా పిలిచే తెనాలి పట్టణంలో ప్రతి యేటా శ్రీరామనవమి ఉత్సవాలు ఎంతో ఘనంగా నిర్వహించబడతాయి. పట్టణంలోని మార్కెట్ సెంటర్‌లో వేంచేసిన శ్రీ సీతారామాంజనేయ స్వామి వారి దేవస్థానం (దొంగ రాముడు గుడి) మరియు బోస్ రోడ్డులోని శ్రీ సీతారామ దేవస్థానంల వద్ద పెద్దఎత్తున చలువ పందిళ్ళు వేసి ప్రత్యేక అలంకరణలతో పందిర్లను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా రకరకాల పిల్లల ఆట వస్తువులు,స్టాల్స్ పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. శుక్రవారం నిర్వహించబడే శ్రీ సీతారామస్వామి కళ్యాణ మహోత్సవానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు తమ బందోబస్తుని సిద్ధం చేశారు. శ్రీ వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం మార్కెట్ సెంటర్ లోని శ్రీ సీతారామాంజనేయ స్వామి వారి దేవస్థానం నందు స్వామి వారు శ్రీ కృష్ణవతారంలో దర్శనమిచ్చారు. శ్రీ స్వామివారి అలంకారానికి మేడ భద్రయ్య నారాయణరావు ఉభయ దాతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా మహిళలచే కుంకుమపూజ నిర్వహించారు. అనంతరం దేవస్థానం వారు విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ చేశారు.

## తెనాలి ప్రభుత్వ ఐటిఐలో ఉద్యోగమేళా

**తెనాలి టౌన్, మార్చి26,(ప్రభాతవార్త):** తెనాలి పట్టణంలోని జగడిగుంటపాలెంలో ఉన్న ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటిఐ) ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సారధ్యంలో




మార్చి30వ తేదీన, తెనాలి నియోజకవర్గ పరిధి లోని,నిరుద్యోగ యువత కోసం ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ రావి చిన్న వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించాలని ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపడుతుందని ఈ జాబ్ మేళాలో వివిధ ప్రముఖ కంపెనీలు పాల్గొని పలు ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థుల్ని ఎంపిక చేసుకుంటాయని పదో తరగతి ఇంటర్మీడియట్ డిగ్రీ డిప్లమా ఇంజనీరింగ్ ఐటిఐ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ జాబ్ మేళాకు హాజరయ్యి కావాలని అభ్యర్థులు తమ విద్యార్హత ధ్రువపత్రాలు తో పాటుగా ఆధార్ కార్డు కూడా తమ వెంట తెచ్చుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు. అలాగే మార్చి 30వ తేదీ సోమవారం తెనాలి పట్టణంలోని జగడగుంటపాలెం వద్ద గల ప్రభుత్వ ఐటిఐ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ నందు రిజిస్ట్రేషన్ ను చేసుకోవచ్చున్నారు. లేదా ఆన్లైన్ లో కూడా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చున్నారు. మరిన్ని వివరాల కోసం కళాశాల అధికారులు డి.రాజా(7893789361) మరియు వి.మణికంఠ గోపాల్ (9346890335)లను సంప్రదించాలన్నారు.

# భాషల విస్తృత అభివృద్ధికి ఏఐ దోహదం

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, మార్చి26, ప్రభాతవార్త:** ఏఎన్‌యులోని తెలుగు, ప్రాచ్య భాషా విభాగంలో తెలుగు– ఇతరభాషలు – కృత్రిమ మేధ ప్రభావం అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ఈ ముగింపు సదస్సుకు డైరెక్టర్ ఆచార్య




ఎన్.వి.కృష్ణారావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ సృజనాత్మక, సంస్కృతి కమీషన్ ఛైర్మన్ పి. తేజస్వి మాట్లాడుతూ ప్రపంచం ఏఐ టెక్నాలజీని వాడుకుంటుందన్నారు. ఏఐ ని వినియోగించుకుని విభిన్న భాషలను, సంస్కృతులను అధ్యయనం చేయాలన్నారు. ఆత్మీయ అతిధిగా పాల్గొన్న దూరవిద్య డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏఐ టెక్నాలజీని అభివృద్ధి పరచడంతో పాటు మన భాషా, సంస్కృతులు, మానవ విలువలు పటిష్టపర్చుకోవాలన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ నుంచి పాల్గొన్న ఆచార్య టి.సూర్యనారాయణ మాట్లాడుతూ ఏఐ కి పూర్తి బానిసలుగా మారవద్దని సూచించారు. ప్రత్యేక అతిధిగా పాల్గొన్న విభాగం సీనియర్ ప్రొఫెసర్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి మాట్లాడుతూ ఇటువంటి సదస్సులు నిరంతరం జరగాలన్నారు. ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార భాషా సంఘం సభ్యులు డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు, విభాగం అధ్యాపకులు ఆచార్య ఇ.మాధవి, అతిధి అధ్యాపకులు డా.సిహెచ్. పవన్‌కుమార్, డా. కె.యశ్వంత్ కుమార్ రెడ్డి, డా.కె.లలితకుమారి, డా. బలరాం, డా.పిల్లి వాసు, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

## కోవిదా ఆర్ట్స్ కల్చరల్ అకాడమీతో ఏఎన్‌యు ఎంఓయు

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, మార్చి26, ప్రభాతవార్త:** ఏపి, తెలంగాణకు చెందిన కోవిదా ఆర్ట్స్ అండ్ కల్చరల్ అకాడమీ మధ్య గురువారం అవగాహన ఒప్పందం (ఎంఓయు) కుదిరింది. ఈ సందర్భంగా వీసి ఆచార్య కె.గంగాధరరావు మాట్లాడుతూఏఎన్‌యు సమగ్రాభివృద్ధిలో కళలు, సంస్కృతి, సృజన్మాక విద్యకు ఉన్న ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థులు వ్యక్తిత్వ వికాసంలో లలితకళలు, ప్రదర్శన కళలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్ మాట్లాడుతూ ఈ ఎంఓయు ద్వారా కళా సంస్కృతి పరిరక్షణ, సృజనాత్మకత, శిక్షణ, విద్యార్థుల నైపుణ్యాల అభివృద్ధికి విశేష అవకాశాలు కలుగుతాయ



న్నారు. కళా సాంస్కృతిక అభివృద్ధికి ఇది ఒక కీలక ముందడుగు అన్నారు. ఈ ఎంఓయు ముఖ్య అతిధిగా పాల్గొన్న కోవిదా ఆర్ట్స్ అండ్ కల్చరల్ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ కళాబందు డాక్టర్ పి.అనూహ్య రెడ్డి మాట్లాడుతూ మానవత్వం, కళలప్రోత్సాహం, సంస్కృతి పరిరక్షణ, ప్రతిభావంతుల గుర్తింపు వంటి అంశాలు తమ సంస్థ ప్రధానలక్ష్యాలని పేర్కొన్నారు. ఏఎన్‌యు వంటి ప్రతిష్టాత్మక వర్సిటీతో అనుబంధం ఏర్పడటం తాము గౌరవంగా భావిస్తున్నామని, ఇకపై కోవిదా అకాడమీ అందించే కార్యక్రమాలు, శిక్షణలు, సర్టిఫికెట్లు విశ్వవిద్యాలయ గౌరవంతో మరింత విలువను సంతరించుకుంటాయని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ఆచార్య ఎస్.మురళీమోహన్, ప్రిన్సిపాల్స్ ఆచార్య కె.వీరయ్య, ఆచార్య ఎల్.ఉదయకుమార్, ఆచార్య మంజుల, పావని, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బాలికల రక్షణ,బాలల హింసా రహిత గ్రామ రూపకల్పనే లక్ష్యం

తాడేపల్లి,మార్చి 26,ప్రభాతవార్త : గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు సిస్టర్ నీరజ ఆధ్వర్యంలో తాడేపల్లి మండలం ప్రాతూరు గ్రామ సచివాలయంలో గ్రామస్థాయి బాలల రక్షణ,పరిరక్షణా చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సిస్టర్ నీరజ మాట్లాడుతూ బాలబాలికల రక్షణ,వారి అభివృద్ధి కోసం పనిచేయడంలో మా సంస్థ ఎప్పుడు ముందుంటుందని తాడేపల్లి మండలంతోపాటు మంగళగిరి, పెదకాకాని,తుళ్ళూరు మండలాల్లో బాలల హక్కుల గురించి,కిశోర బాలికలకు బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి,సమాజంతో ఆడపిల్లలపై జరిగే లైంగిక దాడులు,వేదింపుల నుంచి రక్షించడానికి ప్రభుత్వం నుంచి అందుతున్న సేవలు,చట్టాల గురించి చైతన్యం కల్పిస్తున్నామని,తాడేపల్లి మండల పరిధిలోని 11గ్రామాల్లో మా సంస్థ పనిచేస్తుందని తెలిపారు. గ్రామ సచివాలయ సెక్రటరీ జి.అశోక్‌కుమార్ మాట్లాడుతూ సమాజ భవిష్యత్తు తరాల నిర్మాణ,రేపటి తరం పౌరులైన బాలల అభివృద్ధి కోసం ఇలాంటి ఒక కమిటీ ఏర్పాటు చేయడం చాలా మంచి ఉద్దేశ్యం అన్నారు. అత్తోట పోతురాజు మాట్లాడుతూ సమాజంలో ఎక్కువగా నిర్లక్ష్యానికి హింసకు దోపిడికి గురయ్యేది పిల్లలే అటువంటి పిల్లల ప్రాథమిక హక్కులు పొందలేక పోవడానికి ఉన్న ప్రతి అడ్డంకి తొలగించాలన్నారు.




కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా గ్రామపెద్దలు అరవపల్లి శ్రీనివాస్ హాజరై చాలా మంచి కార్యక్రమం పిల్లల కోసం మీరు మీ సంస్థ ద్వారా చేస్తుంది అని మా సహాయ సహకారం ఎప్పుడూ ఉంటుందని,నూతన గ్రామ బాలల సంరక్షణ కమిటిని అభినందించారు. కార్యక్రమంలో సచివాలయం,హెల్త్ డిపార్ట్‌మెంట్,గ్రామ పెద్దలు అంగన్‌వాడీ టీచర్స్,గుడ్ షెఫర్డ్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది అత్తోట పోతురాజు,పెద్దిపాగ అనిల్‌కుమార్,సచివాలయ సిబ్బంది స్థానిక ఆషా వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు దక్షతతోనే రాష్ట్రానికి అత్యధిక పెట్టుబడులు

**గుంటూరు విద్య మార్చి 26 ప్రభాతవార్త :** రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వారు చంద్రన్న ముఖంలోని సమర్థతను,దక్షతను,పరిణితిని,నమ్మకాన్ని,కార్యదక్షతను చూస్తున్నారు కాబట్టే అడిగినా,అడగక పోయినా పోటీపడి పెట్టుబడులు,పరిశ్రమలు ప్రవాహంలా వస్తున్నవిషయం జగమెరిగిన సత్యమని. టిడిపి రాష్ట్ర కార్యదర్శి దాసరి రాజా మాష్టారు అన్నారు. ..ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ను జగన్రెడ్డి తానే తెచ్చినట్లు,దావోష్ లో అవగాహనా ఒప్పందం పైన జగన్రెడ్డి తానే సంతకమెత్తినట్లు, చంద్రబాబు సుందరముఖాన్ని చూసి పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ఏ ఒక్కరూ ముందుకు రారని ..ఉత్తర ప్రగల్భాలు పలుకుతున్న జగన్రెడ్డి మతి భ్రమించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని తెలిపారు.



పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు కోరుకునేది ముఖ్యమంత్రి పై నమ్మకం, సమర్థత, కార్యదక్షత,అనుకూల వాతావరణం, ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం పైనమ్మకం,"నాయకుడి ఘనమైన గత చరిత్ర మాత్రమే పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుంది తప్ప, జగన్రెడ్డి చెప్పినట్లు అందచందాలు పరిగణనలోకి తీసుకోరన్న ఇంకిత జ్ఞానం మాజీ ముఖ్యమంత్రి గా రాష్ట్రాన్ని 5 ఏళ్లు ఏలిన జగన్రెడ్డికి తెలియకపోవడము రాష్ట్రప్రజల దురదృష్టం అని పేర్కొన్నారు. చంద్రన్న నిజంగానే 6 అడుగుల అందగాడు ,75 ఏళ్ళుపైబడిన నవయువకుడు ,ప్రపంచ దేశాలలో తెలుగు వారు ఎక్కువగా ఇష్టపడే విజ్ఞత గల నాయకుడు"లక్ష కోట్ల ప్రజాధనాన్ని దోచుకుని,16 నెలలు జైల్లో రిమాండ్ ఖైదీ గా ఉన్న ఆర్థిక నేరగాడు అయిన వ్యక్తి జగన్రెడ్డి కూడాచంద్రబాబు నాయుడుని విమర్శించడానికి ఎంచుకున్నకుటిల రాజకీయ ప్రయత్నాన్ని టిడిపి పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నట్లు రాజా మాష్టారు పేర్కొన్నారు..

## భారత ఎన్నికల సంఘం ప్రతిష్ట రోజు రోజుకి దిగజారటం ఆందోళనకరం

**గుంటూరు కల్చరల్,మార్చి 26,ప్రభాతవార్త :** స్వతంత్రంగా,నిష్పక్షపాతంగా,పారదర్శకంగా పనిచేయాల్సిన భారత ఎన్నికల సంఘం ప్రతిష్ట రోజు రోజుకి దిగజారటం ఆందోళనకరమని అవగాహన సంస్థ నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న వక్తలు అభిప్రాయపడ్డారు. సంస్థ కార్యాలయంలో కేంద్ర ఎన్నికల కమీషన్ తీరు తెన్నులు అన్న అంశంపై పాల్గొన్నవారు ప్రసంగించారు. కార్యక్రమంలో మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్.మూర్తి మాట్లాడుతూ ఓటర్ల జాబితా సమగ్ర సవరణ పేరుతో అర్హుల ఓట్లు తొలిగిస్తున్నారని పోలింగ్ అనంతరం ఓటింగ్ శాతం భారీగా పెరుగుతొందని,నకిలీ ఓట్లు భారీగా చేరుస్తున్నారని వెలువెత్తుతున్న విమర్శలకు సమాధానం చెప్పుకోలేని స్థితిలో ఎన్నికల కమీషన్ ఉండడం అత్యంత శోచనీయమన్నారు. విశ్రాంత ఇంజనీర్ పి.ఘనశ్యామాచార్యులు మాట్లాడుతూ ప్రధాన ఎన్నికల కమీషనర్,ఎన్నికల కమీషనర్ల ఎంపికలో పారదర్శకత లేక పోవడం ఈసీ స్వతంత్రతను దారుణంగా దెబ్బతీస్తుందన్నారు. సమావేశంలో పెన్షనర్ల సంఘ నాయకులు ఎల్.మురళీకృష్ణ,విశ్లేషకులు ఆర్.వి. సింగరయ్య తదితరులు ప్రసంగించారు.

